రిజర్వేషన్ల రద్దుకు బిజెపి ప్రయత్నం

- ఒబిసి లెక్కలు చారిత్రాత్మక అవసరం
- రిజర్వేషన్ల రద్దుపై మోడీ, అమిత్ షా ఎందుకు స్పందించరు?
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రిజర్వేషన్ల రహిత భారత్ కోసం బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నం చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టిలపై ఆ పార్టీ సర్జికల్ స్ట్రైక్ చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా వారిని కార్పొరేట్లకు కట్టుబానిసలుగా మార్చబోతున్నదని తెలిపారు. ఒబిసి జనాభా లెక్కిస్తామంటేనే బిజెపి భయపడుతోందన్నారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ వస్తే ఆస్తులు గుంజుకుంటుందనీ, పుస్తెల తాళ్లు కూడా లాగేసుకుంటుందంటూ దుష్ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. భార్య ఆస్తిని భర్త వాడుకునే అవకాశం లేదని న్యాయశాస్త్రాలు చెబుతున్నాయని చెప్పారు. ఎవరి కష్టార్జితం వారిదేనన్నారు. రిజర్వేషన్ల రద్దు విషయంలో బిఆర్‌ఎస్ వైఖరేంటో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు సంపత్‌కుమార్, బెల్లయ్యనాయక్, రోహిన్‌రెడ్డి, సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్‌తో కలిసి సిఎం రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు కల్పించిందే కాంగ్రెస్ అన్నారు. 1978లో బిసిలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు బిపి మండల్ కమిషన్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. బిపి మండల్ కమిషన్ బిసిలకు 27శాతం ఇవ్వాలని సూచించిందన్నారు. ఆనాడు ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల వర్గాలు ఈ రిజర్వేషన్లను వ్యతిరేకించాయని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు కూడా మండల్ కమిషన్ నివేదికను సమర్థించిందన్నారు. రిజర్వేషన్లు 50శాతానికి మించకుండా అమలు చేయాలని సూచించిందన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలంటూ రాహుల్ గాంధీకి ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని తెలిపారు. బిసి కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. దేశంలో రిజర్వేషన్లు లేకుండా చేయాలని బిజెపి కంకణం కట్టుకుందని విమర్శించారు. 2025లోగా రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మోడీ, అమిత్‌షా లకు ఆదానీ, అంబానీ తొడయ్యారని ఎద్దేవా చేశారు. దేశ మూలవాసులైన దళితులు, గిరిజనులు, ఒబిసిలపై సర్జికల్ స్ట్రైక్స్ చేస్తున్నారని తెలిపారు.

దేశం అత్యంత ప్రమాదకర పరిస్థితుల వైపు వేగంగా ప్రయాణిస్తున్నదని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌పై మోడీ, అమిత్ షా విషప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించి ఎన్నికల్లో 400 సీట్లు గెలవాలని వికృత రాజకీయ క్రీడకు తెర లేపారని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ మనువాద సిద్ధాంతాన్ని బిజెపి అమలు చేయాలని చూస్తోందన్నారు. అందుకే 400 సీట్లు కోరుకుంటున్నారని తెలిపారు. 'ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్, యూనిఫామ్ సివిల్ కోడ్, సిటిజన్ అమెండ్‌మెంట్ యాక్ట్ వంటి వాటిని గత పదేండ్లుగా అమలు చేస్తున్నది' అని తెలిపారు. జనాభా లెక్కిస్తేనే దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచే వీలుంటుందన్నారు. రిజర్వేషన్లు రద్దు చేయబోమనీ, రిజర్వేషన్లు పెంచుతామంటూ మోడీ, అమిత్‌షా ఎక్కడా మాట్లాడం లేదన్నారు.

కెసిఆర్ టార్గెట్ వంద రోజుల ప్రభుత్వమా?

కెసిఆర్ టార్గెట్ వంద రోజుల కాంగ్రెస్ ప్రభుత్వమా? పదేండ్లుగా ప్రజలను దగా చేసిన బిజెపి ప్రభుత్వమా? చెప్పాలని రేవంత్ డిమాండ్ చేశారు. కెసిఆర్ అసలు ఈ విషయాన్నీ ప్రస్తావించడంలేదన్నారు. అమెరికా నుంచి అమలాపురం వరకు...చంద్ర మండలం నుంచి చింతమడక వరకు కెసిఆర్ అన్నీ మాట్లాడుతున్నారనీ, కానీ బిజెపి చేసే కుట్ర గురించి మాత్రం మాట్లాడటం లేదని విమర్శించారు. రిజర్వేషన్లు రద్దు చేయాలన్న బిజెపి విధానంపై బిఆర్‌ఎస్ వైఖరేంటో కెసిఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు రద్దు చేస్తే మీ కార్యాచరణేంటో చెప్పాలని కోరారు. 'వంద రోజుల మా ప్రభుత్వాన్ని దిగిపొమ్మంటూ బస్సుయాత్ర చేస్తున్నావు కదా...రాజ్యాంగాన్ని దెబ్బతీసే మోడీపై నీ కార్యాచరణ ఎక్కడుంది? కవిత బెయిల్ కోసం బిజెపితో కెసిఆర్ ఒప్పందం చేసుకున్నారా? మల్కాజిగిరిలో బిజెపి గెలుస్తుందంటూ మేడ్చల్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాల్లారెడ్డి చెప్పడం ఇందుకు నిదర్శనం కాదా? నిజంగా బిజెపితో వైరం ఉంటే మల్లారెడ్డిని పార్టీలో నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదు. బహిరంగంగా ప్రజల ముందు బిజెపి గెలుస్తుందని చెప్పిన ఎమ్మెల్యేను కెటిఆర్ సమర్థించడం దేనికి సంకేతం?' అని ప్రశ్నించారు.

బిజెపికి ఐదు సీట్లు బిఆర్‌ఎస్ తాకట్టు

లోక్‌సభ ఎన్నికల్లో ఐదు పార్లమెంట్ స్థానాలను బిజెపికి బిఆర్‌ఎస్ తాకట్టు పెట్టిందని ఆరోపించారు. గతంలో తనను ఎంపిగా ఓడించేందుకు 31 సమావేశాలు పెట్టిన కెటిఆర్... ఈ ఎన్నికల్లో ఇప్పటి వరకు కేవలం ఒక్క సమావేశం పెట్టారని గుర్తు చేశారు. బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా కెటిఆర్ మాట్లాడలేదన్నారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి సాక్షిగా మాట ఇస్తున్నా... ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి తీరుతాం. తెలంగాణ సమాజానికి విజ్ఞప్తి చేస్తున్నా... రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ గెలవాలి. వద్దనుకుంటే బిజెపికి ఓటేయండి అని విజ్ఞప్తి చేశారు.

బిజెపిని చిత్తుగా ఓడించండి

- నవోదయ పాఠశాల కోసం వంద ఉత్తరాలు రాశాం
- రాష్ట్రంలో విద్యుత్ అంతరాయం బాధాకరం
- రైతులను, కార్మికులను ముంచిన కాంగ్రెస్
- మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణ ప్రజల బతుకులను భగ్నం చేసిన మోడీకి ఓటేసి బిజెపి ప్రభుత్వాన్ని బలపరచొద్దు.. చట్ట ప్రకారం ప్రతి జిల్లాకూ నవోదయ పాఠశాల రావాల్సి ఉండగా విద్యా కేంద్రాల కోసం వంద ఉత్తరాలు రాసినా ప్రధాని మోడీ స్పందించలేదు. మత ప్రాతిపదికన పరిపాలన కొనసాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలి.. మహబూబ్‌నగర్ ఎంపి అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్ రెడ్డి, నాగర్ కర్నూల్ నుంచి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి' అని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్‌లో రోడ్‌షో కార్నర్ మీటింగ్ బస్టాండ్ సమీపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలను ఆగం చేసిన బిజెపి, కాంగ్రెస్‌కు ఓటేస్తే పాలమూరు ప్రజల బతుకులు ఆగమైపోతాయని అన్నారు. పదేండ్లు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రానికి ఇచ్చిన ఒక్క హామీనీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని మోడీ అక్కరకు రాని సుట్టంగా మారరని విమర్శించారు. సబ్కా వికాస్, డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా వికసిత భారత్‌తో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్లు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయి పట్టం గడితే రైతులను, కార్మికులను నిలువునా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకు పదిసార్లు విద్యుత్ అంతరాయం కలగడం చూస్తుంటే బాధేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు జరిగిన రైతు ఆత్మహత్యలు మళ్లీ పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని మోడీకి.. బిఆర్‌ఎస్ మధ్య జరుగుతున్న ధర్మ యుద్ధంలో బిఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓటేసి న్యాయం పక్షం నిలబడాలని కోరారు. తెలంగాణ ప్రజలు పార్లమెంటు ఎన్నికల ద్వారా మరో పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాసులు గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, గువ్వల బాలరాజు, జయపాల్ యాదవ్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, సీనియర్ నాయకులు నాగం జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రఘుబాబు స్మారక నాటిక నాటకాలు సందేశాత్మకం'

ప్రజాశక్తి - కల్చరల్

రవీంద్ర భారతి ప్రధాన వేదికపై జరుగుతున్న పరుచూరి రఘు బాబు స్మారక 34వ జాతీయ స్థాయి నాటక నాటిక పోటీలలో భాగంగా రెండవ రోజు డాక్టర్ రామన్ ఫౌండేషన్ సాయిబాబా నాట్య మండలి విజయవాడ వారు "విజ్ఞాన భారతం" నాటకం ప్రదర్శించారు. అమెరికాలో సైంటిస్ట్ గా ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడిన నాస్తికుడైన లక్ష్మీపతి, స్వదేశంలో పురోహిత్యం చేస్తూ భారత సంప్రదాయాలను కాపాడాలని తపిస్తూ తన మేనల్లుడిని కూడా అదే వృత్తిలో పెట్టిన రామ శాస్త్రి అన్నదమ్ములు. దూరవిద్యలో సంస్కృతం ఎంఎ చేసిన ఆ మేనల్లుడు ప్రపంచ స్థాయి మేధావుల పోటీలో భారత దేశం నుండి ఎన్నుకోబడతాడు. అలాగే అమెరికాలో స్థిరపడిన చిన్నమామ గారితో ఫైనల్లో తలపడి భారతదేశం పది వేల సంవత్సరాల క్రితమే విజ్ఞానం పొంది ఉందని సైంటిఫిక్ గా శాస్త్ర ప్రమాణంగా నిరూపించి మిలియన్ డాలర్ల క్యాష్ ప్రైజ్ పొందుతాడు.తర్వాత అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారు "అమృత హస్తం" నాటిక ప్రదర్శించారు.

భానుడి భగభగ

- పలు జిల్లాల్లో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు
- నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భానుడు భగభగ మండిపోతున్నాడు. శనివారం నాడూ రాష్ట్రంలో పలుచోట్ల 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో శనివారం అత్యధికంగా 45.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయ్యింది. కరీంనగర్, జగిత్యాల, ములుగు, నల్లగొండ జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో వచ్చేమూడు రోజులూ ఎండలు ఇదే రీతిలో ఉంటాయనీ, వేడుగాడ్పులు వీస్తాయని హెచ్చరించింది. అదే సమయంలో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని తెలిపింది. జమ్మికుంట(కరీంనగర్)45.4 డిగ్రీలు, మాడ్గులపల్లి(నల్లగొండ)45.2 డిగ్రీలు, ములుగు 45.2 డిగ్రీలు, వెల్గటూరు (జగిత్యాల), 45.1 డిగ్రీలు ధర్మవరం (ములుగు) 45.1 డిగ్రీలు

268 మంది నామినేషన్ల తిరస్కరణ

- అత్యధికంగా మల్కాజిగిరిలో 77
- పరిశీలన అనంతరం బరిలో 625 మంది అభ్యర్థులు
- 29న ఉపసంహరణల అనంతరం తుది జాబితా వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నామినేషన్ల పరిశీలన అనంతరం లోకసభ బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితాను ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. మొత్తం 17 పార్లమెంట్ నియోజక వర్గాల్లో 893 మంది అభ్యర్థులు 1,488 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. 268 మంది అభ్యర్థులతో పాటు 428 నామినేషన్ సెట్లను వివిధ కారణాలతో ఎన్నికల అధికారులు తిరస్కరించారు. పరిశీలన అనంతరం 625 మంది అభ్యర్థులకు చెందిన 1,060 నామినేషన్ సెట్లను అనుమతించారు. కాగా రాష్ట్రంలో అత్యధికంగా మల్కాజిగిరి నియోజక వర్గంలో 114 మంది అభ్యర్థులు 177 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, 77 మంది అభ్యర్థులతో పాటు 115 నామినేషన్ సెట్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. అత్యల్పంగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఒకే ఒక్క నామినేషన్ తిరస్కరకు గురికాగా బరిలో 53 మంది మిగిలారు. కాగా అదిలాబాద్ లోక్‌సభ స్థానంలో అత్యల్పంగా 23 మంది నామినేషన్లు దాఖలు చేయగా అందులో పది మంది నామినేషన్లు రిజెక్టయ్యాయి. ఈ స్థానం నుంచి రాష్ట్రంలోనే అతి తక్కువగా 13 మంది మాత్రమే బరిలి మిగిలారు. ఉపసంహరణ గడువైన ఈ నెల 29 తర్వాత పోటీలో నిలవబోయే తుది అభ్యర్థుల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించనుంది.

ఎర్రగడ్డ డివిజన్‌లో కెటిఆర్ పాదయాత్ర

- పద్మారావును గెలిపించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ శనివారం సాయంత్రం హైదరాబాద్ ఎర్రగడ్డ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి ఆయన ఇంటింటికీ తిరుగుతూ పద్మారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే ప్రతి షాపులోనూ వ్యాపారస్తులను పలకరిస్తూ.. కరపత్రాలు పంచుతూ బిఆర్‌ఎస్ చేసిన మంచి పనులను ఒకసారి జ్ఞాపకం చేసుకొని కారు గుర్తుపై ఓటు వేయాలన్నారు.

పట్టుదల ఉంటే పోటీ పరీక్షల్లో రాణించొచ్చు

- సివిల్స్ ర్యాంకర్ అడుసుమిల్లి మౌనిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భాషపై అవగాహన, పకడ్బందీ ప్రణాళిక, అందుకు తగిన కృషి, పట్టుదలతోపాటు వ్యక్తిగతంగా నోట్స్ తయారు చేసుకునే విధానం ఉంటే ఎవరైనా పోటీ పరీక్షల్లో రాణించొచ్చని సివిల్స్ ర్యాంకర్ అడుసుమిల్లి మౌనిక అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్ లో ఉన్న ఎస్‌ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమీ ఆధ్వర్యంలో మౌనికను తెలుగు సాహిత్య అకాడమీ అడ్వైజర్, గార్డెనర్, ఎక్స్ ఐఎఫ్ ఎస్ అడిషనల్ కమిషనర్ వై సత్య నారాయణ, ప్రిన్సిపల్ సురేందర్‌రెడ్డి, కోర్సు కో-ఆర్డినేటర్ దండు జనార్ధన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె సతీశ్‌కుమార్ శాలువాతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఉన్నాయనీ, భవిష్యత్తులో వాటిని సాధించేందు కు మరింత పట్టుదలతో అనంతరం అకాడమీలో విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మౌనిక సమాధానమిచ్చారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు మెళకువలు వివరిం చారు. కార్యాలయ సిబ్బంది అల్లువెంకటేశ్, బి రాజేందర్, బి రంజిత్‌కుమార్, బి సంధ్యారాణి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కోట మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్ పరిశీలన

- 14 కిలోమీటర్లను పరిశీలించిన హెచ్‌ఎఎంఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి
- అధికారులకు పలు ఆదేశాలు

కారిడార్‌ను పరిశీలిస్తున్న ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగా తలపెట్టిన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ మెట్రో స్టేషన్ స్థానాలను ఖరారు చేసేందుకు హెచ్‌ఎఎంఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి శనివారం నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు సుమారు 14 కిలోమీటర్లు కాలినడకన పరిశీలించారు. నాగోలు-ఎయిర్‌పోర్ట్ మార్గంలో కొత్తగా నాగోల్ వద్ద నిర్మించనున్న మెట్రో స్టేషన్.. ప్రస్తుతం ఉన్న నాగోల్ స్టేషన్‌కు దగ్గరలోనే ఎడమ వైపున (ఎల్‌బినగర్ వైపు) ఉంటుంది. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఈ రెండు స్టేషన్లను కాన్‌కోర్స్ లెవల్‌లో కలుపుతూ విశాలమైన స్కైవాక్ నిర్మాణాన్ని చేపట్టాలని ఈ సందర్భంగా ఎండి ఆదేశించారు. నాగోల్ స్టేషన్ తర్వాత మూసీ నది బ్రిడ్జిని ఆనుకొని ఉన్న పెద్ద మంచినీటి పైపులు, భూగర్భ హైటెన్షన్ విద్యుత్ కేబుళ్ల దృష్ట్యా, మెట్రో ఎలైన్‌మెంటును మరో పది మీటర్లు ఎడమ వైపునకు జరపాలన్నారు. అలాగే మూసీ నదిపై మెట్రో బ్రిడ్జిని పొడవైన స్పాన్‌లతో నిర్మించాలని సూచించారు. ఇక కొత్తపేట జంక్షన్ నుంచి వచ్చే రహదారికి కనెక్టివిటీని ఇస్తూ ఆ చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులందరి అవసరాల కోసం అదనపు స్టేషన్‌కు ప్లాన్ చేయాలని చెప్పారు. ప్రతిపాదిత నాగోల్ ఆర్టీఓ స్టేషన్‌ను అల్కాపురి జంక్షన్ (లక్కీ రెస్టారెంట్)కు సమీపంలో నిర్మించాలన్నారు. ఎల్బీనగర్ జంక్షన్‌కు కుడి వైపున ఉండబోయే కొత్త స్టేషన్.. కారిడార్-1లో (మియాపూర్-ఎల్బీనగర్) ప్రస్తుత ఎల్బీనగర్ స్టేషన్‌కు విశాలమైన స్కై వాక్‌తో అనుసంధానించాలని ఎండి ఆదేశించారు.

బైరామల్‌గూడ/సాగర్ రోడ్ జంక్షన్‌లో ఇప్పటికే ఎత్తైన ఫ్లైఓవర్‌లు ఉండటంతో ఎయిర్‌పోర్ట్ మెట్రో లైన్ ఎత్తు ఇంకా పెంచాల్సి ఉంది. అయితే బైరామల్‌గూడ/సాగర్ రోడ్ జంక్షన్ మెట్రో స్టేషన్ ఎత్తును తగ్గించడానికి గాను, మెట్రో అలైన్‌మెంట్‌ను ఫ్లై ఓవర్లకు కుడి వైపునకు మార్చాల్సి ఉంటుందని, పక్కనే ఉన్న బహిరంగ ప్రదేశంలో స్టేషన్ నిర్మాణం చేపట్టాలని అధికారులకు, కన్సల్‌టెంట్‌కు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి సూచించారు. మైత్రీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట జంక్షన్, ఒవైసీ హాస్పిటల్, డిఆర్‌డిఒ, హఫీజ్ బాబా నగర్ తదితర ప్రాంతాలలో ప్రతిపాదిత స్టేషన్‌లను అక్కడకు దగ్గరలోని కాలనీవాసులుకు వీలుగా జంక్షన్‌లకు సమీపంలో నిర్మించాలని సూచించారు.

చాంద్రాయణగుట్టలో ఫ్లైఓవర్ నిర్మాణం ఉన్నందున ఇక్కడ ఇంటర్‌చేంజ్ స్టేషన్ నిర్మాణం, అలాగే, చంద్రాయణగుట్ట వరకూ చేపట్టిన పాత నగరం మెట్రో విస్తరణ పనులు, టెర్మినల్ స్టేషన్ నిర్మాణ పనులు ఒక ఇంజనీరింగ్ సవాలుగా మారే అవకాశం ఉందని ఎన్‌విఎస్ అన్నారు. రెండు కారిడార్‌లను అనుసంధానిస్తూ నిర్మించనున్న ఈ ఇంటర్‌చేంజ్ స్టేషన్‌లో కాంకోర్స్, ప్లాట్ ఫారంల ఎత్తును సరిచేయాలని ఎండి ఆదేశించారు. ప్రయివేటు ఆస్తులను కనిష్టంగా సేకరించే విధంగా స్టేషన్‌లకు అనుగుణంగా జాగ్రత్తగా ప్రణాళికల ను రూపొందించాలని అధికారులకు సూచించారు. మెట్రో స్టేషన్ల స్థల ఎంపికకు సంబంధించి, అలాగే స్టేషన్ పేర్లను ఖరారు చేసేముందు స్థానికులను, ట్రాఫిక్ పోలీసులను, హెచ్‌ఎఎంఎల్ అధికారులు సంప్రదించాలని ఎండి సూచించారు. ఈ పర్యటనలో మెట్రో ఉన్నతాధికారులతో పాటు ఇంజనీరింగ్ కన్సల్‌టెన్సీ సిస్ట్రా ఇంజనీరింగ్ నిపుణులు, హెచ్‌ఎఎంఎల్ సిఇఇ డివిఎస్ రాజు, సిఎస్‌టిఇ ఎస్‌కె దాస్, సిపిఎం బి ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్ బిఎన్ రాజేశ్వర్, ఎస్ఇ వై సయప రెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ ఎంఎస్ సిస్ట్రా ఇంజనీరింగ్ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బిసి గురుకుల జూనియర్ కాలేజీల ప్రవేశ పరీక్ష

- మొత్తం 47,461 మంది దరఖాస్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలంగాణ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం మొత్తంల 47,461 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 209 కేంద్రాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రం వివరాలు ముందుగానే సరిచూసుకోవాలని తెలిపారు. చివరి నిమిషంలో టెన్షన్ పడొద్దనీ, నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు.

అబద్ధాల పునాదులపై రేవంత్ ప్రస్థానం

- హరీశ్ రావు సవాల్‌ను ఎందుకు స్వీకరించరు?
- బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానమే అబద్ధాల పునాదులపై నిలబడి ఉందని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బిఆర్‌ఎస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ప్రజా విశ్వాసాన్ని కోల్పోయారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు రాకపోతే తన సీటుకు ఎసరొస్తుందని ఆయన భయపడుతున్నారన్నారు. అందుకే దేవుళ్ళ మీద ఒట్లు పెడుతున్నారని గుర్తు చేశారు. విశ్వాసాన్ని కోల్పోయిన వాళ్ళే తడి బట్టలతో గుడుళ్లోకి వెళ్తారని చెప్పారు. రుణమాఫీ, గ్యారంటీలను అమలు చేయకపోతే సిఎం పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారనీ, దానిపై నేరుగా స్పందించకుండా మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. హరీశ్‌రావు ఉద్యమ ప్రారంభం నుంచి కెసిఆర్‌కు కుడి భుజంగా ఉన్నారని గుర్తు చేశారు. రేవంత్ సవాళ్లు చేస్తారు.

రోడ్లే కళ్లాలు..?

- పొంచివున్న ప్రమాదాలు
- ముందుకు సాగని కళ్లాల నిర్మాణం
- స్థలాల కొరత, నిధుల సమస్య ఆసక్తి చూపని రైతులు
- ఆగిపోయిన నిర్మాణాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరి ధాన్యం అరబెట్టుకునేందుకు రైతులకు ఎండు కళ్లాలు కరువయ్యాయి. రోడ్లే కళ్లాలుగా మారాయి. ఎక్కడ చూసినా రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్నాయి. ఈ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బిఆర్‌ఎస్ హయాంలో కళ్లాల నిర్మాణం నిధుల మంజూరు జరిగినా అవి ముందుకు సాగలేదు. కొన్ని పనులు ప్రారంభమై మధ్యలో ఉండగా.. మరికొన్ని చోట్ల ముందడుగే పడలేదు. దాంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఎక్కడా ఖాళీ లేకపోవడం తో రోడ్లపైనే పంట ను ఆరబోస్తున్నారు. గతేడాది భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని పెద్దతూండ్ల, తాడి చెర్ల ప్రధాన రహదారి, ఎడ్లపల్లి, రుద్రారం ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరిగి పలువురు తీవ్రంగా గాయపడిన ఘటనలున్నా యి.

కళ్లాలు నిర్మించుకునేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా అవకాశం కల్పించినా.. ప్రభుత్వం నిధులు సకాలంలో చెల్లించడం లేదు. దాంతో రైతులు కళ్లాలు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు స్థలాల కొరత కూడా ఉంది. అయితే ఎండు కల్లాల నిర్మాణాలపై సంబంధిం చిన ఈజీఎస్ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇప్పటికి ఒక్కటి కూడా పూర్తి కాలేదు.

నిర్మాణం శూన్యం

ఉపాధిహామీ చట్టంలో భాగంగా మండలం లో 139కళ్లాల నిర్మాణాలకు రూ.1కోటి 60 లక్షల 92 వేలు మంజూరయ్యాయి. రెండేండ్ల కిందట క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తి కాలేదు. 42 కళ్లాల నిర్మాణంలో కొంత పురోగతి ఉండగా.. వీటికి ఇప్పటికే రూ.9.92 లక్షల బిల్లులు చెల్లించారు. ఇంకా 97 కళ్లాల పనులు ప్రారంభమే కాలేదు. 538 చదరపు అడుగుల కళ్లాల నిర్మాణానికి రూ.58 వేలు, 645 చదరపు అడుగుల నిర్మాణానికి రూ.68 వేలు, 807 చదరపు అడుగుల నిర్మాణానికి రూ.85 వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే మార్కెట్‌లో అన్నింటి ధరలూ పెరగడంతో.. నిర్మాణ వ్యయం అధికం కావడంతోపాటు బిల్లులు సకాలంలో రాకపోవడం, స్థలాల సమస్య వల్ల రైతులు కళ్లాల నిర్మాణం పట్ల ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

రోడ్లపై ధాన్యంతో ప్రమాదాలు..

ఈ ఏడాది రబీ సీజన్‌తో వరిధాన్యం దిగుబడులు మామూలుగా వస్తున్నాయి. ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలాలు లేక ప్రధాన రహదారులు, గ్రామీణ రోడ్లపై రైతులు పోస్తున్నారు. రాత్రి సమయంలో కుప్పలు చేసి టార్పాలిన్లు కప్పి ఉంచుతున్నారు. పలుచోట్ల రోడ్లను పూర్తిగా బ్లాక్ చేయంతోపాటు సగం స్థలాన్ని ఆక్రమించడం.. ధాన్యంలోకి వాహనాలు రాకుండా చుట్టూ పెద్ద పెద్ద బండరాళ్లు పెట్టి ఉంచుతున్నారు. దీంతో చీకట్లో కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకవైపు రోడ్డుపైనే వాహనాల రాకపోకలు ఇబ్బందికరంగా మారుతోంది. రాత్రివేళల్లో ధాన్యం కుప్పలను ఢీకొని తీవ్రంగా గాయపడుతున్నారు.

చేనేతపై 12శాతం జిఎస్‌టి విధించింది బిజెపినే..

- గత ప్రభుత్వం వల్లే వస్త్ర పరిశ్రమలో సంక్షోభం
- ఎన్నికలు ముగిసినశాక కార్మికులకు కొత్త పాలసీ తీసుకొస్తాం
- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దీపాదాస్ మున్షి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత గుడ్డపై 12శాతం జిఎస్‌టి విధించింది బిజెపి ప్రభుత్వమేనని, బిజెపి- బిఆర్‌ఎస్ శవ రాజకీయాలు చేస్తున్నాయి.. పదేళ్లలో సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ పద్మశాలి కమ్యూనిటీకి ఏమీ చేయలేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. సిరిసిల్ల పట్టణం, తంగళ్లపల్లి మండల కేంద్రంలో నేత కార్మికుల వరుస ఆత్మహత్యల నేపథ్యంలో శనివారం బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దీపాదాస్ మున్షీ మాట్లాడారు. పదేండ్లుగా పని చేయించుకొని బీఆర్‌ఎస్ ప్రభుత్వం బిల్లు చెల్లించకపోవడం వల్ల నేడు నేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఎవరూ అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని చెప్పారు. సిరిసిల్లలో 27 వేల పవర్‌లూమ్స్ ఉన్నాయని, చాలా కుటుంబాలు వస్త్ర పరిశ్రమపై ఆధారపడి ఉన్నాయని చెప్పారు. బిఆర్‌ఎస్ హయాంలో నేత కార్మికులకు పనులు కల్పించినా.. సంబంధించిన బిల్లులు చెల్లించలేదని అన్నారు. దీనివల్ల పవర్‌లూమ్స్ పరిశ్రమ కొద్దిరోజులు మూతపడిందన్నారు. రూ.26 వేల పవర్‌లూమ్స్ ఉన్న సిరిసిల్లలో నేత కార్మికులకు కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి ప్రణాళికలూ రూపొందించలేదని విమర్శించారు. కెటిఆర్ పద్మశాలీలను కేవలం రాజకీయంగా వాడుకున్నారన్నారు. బతుకమ్మ చీరల బకాయి బిల్లులు గత బిఆర్‌ఎస్ సర్కార్ పాపమేనన్నారు. నాలుగు నెలల్లో ఐదుగురు కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల కోసం కొత్త పాలసీ తీసుకొస్తుందని వెల్లడించారు. బిజెపి, బిఆర్‌ఎస్ శవరాజకీయాలు మానుకుని చేనేత కార్మికులను ఆదుకునేందుకు ముందుకురావాలని హితవు పలికారు.

ఉత్పత్తి పెంపు.. అధిక పని కల్పిస్తాం.. : మంత్రి పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నేతన్నల ఆత్మహత్యలు దురదృష్టకరమన్నారు. రాజకీయాలు ఎప్పుడైనా చేయొచ్చని, ముందు నేతన్నలకు ధైర్యం కల్పించే ప్రయత్నం చేద్దామని అన్నారు. గతంలో నేతన్నలకు ఉన్న రూ.12 వేల అంత్యోదయ కార్డులను ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. అవి ఉంటే ఇప్పుడు 35 కిలోల బియ్యం వచ్చేవి కదా అని అన్నారు. జిఒ నంబర్-1 ద్వారా బట్టల ఆర్డర్ ఇవ్వడానికి గతంలో కంటే అదనంగా ఇచ్చేలా తమ పాలసీ ఉంటుందని, ఎన్నికల కోడ్ ఉండటం వల్ల ఆగిపోయిందని, ప్రభుత్వం మంచి పాలసీ తీసుకోవడానికి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఉత్పత్తి పెంచి కార్మికులకు అధిక పని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, దయచేసి ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. నాలుగు నెలల తమ పాలనలో ఈ ఆత్మహత్యలు జరగలేవని, బిఆర్‌ఎస్ పాలనలో సరైన విధానాలు లేక పోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. యజమాని, ఆసామి, కార్మికులు మూడు అంచెల వ్యవస్థ సిరిసిల్లలో ఉందని, ఇప్పటికే నేత కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి, విష్ణు నాథ్ మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేతన్నలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- ఉపాధి కల్పించి ఆత్మహత్యలను నివారించాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- నేత కార్మిక కుటుంబాలకు పరామర్శ
- బాధితులతో కలిసి అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన

నేత కార్మిక కుటుంబాలతో కలిసి నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేతన్నలను విస్మరించడంతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయి, ఉపాధి లేక కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న ఐదుగురు నేత కార్మిక కుటుంబాలతో కలిసి తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉపాధి కల్పించి ఆత్మహత్యలను నివారించాలని, బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నాలుగు నెలల నుంచి సంక్షోభం ఏర్పడిందన్నారు. కార్మికులు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ఐదుగురు కార్మికులు ప్రాణం తీసుకోవడం బాధాకరమని అన్నారు. పదేండ్లు పరిపాలనలో ఉన్న బిజెపి, బిఆర్ఎస్ నేతన్నలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తోందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శవ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐదేళ్లు కరీంనగర్ పార్లమెంటు సభ్యునిగా ఉన్న బండి సంజయ్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఏం చేశారని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోగా దీక్ష చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. 15ఏండ్లు స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న కెటిఆర్ నేతన్నల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపెట్టక పోవడంతోనే ఇలాంటి పరిస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నల సమస్యలపై ఏమీ పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వం జనతా వస్త్ర పథకాన్ని ప్రవేశపెట్టి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సమస్యలన్నీ పరిష్కరించి మరో ఆత్మహత్య జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 10శాతం యారన్ సబ్సిడీ రూ.18 కోట్లను వెంటనే అందించాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తంగళ్ళపల్లి ఇందిరానగర్‌లో నేత కార్మికుడు అంకారపు మల్లేశం కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీప దాస్ మున్షి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి మాట్లాడారు. నేత్తన్నల ఆత్మహత్యలు, ఉపాధి తదితర సమస్యలను పరిష్కరించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూశం రమేష్, జిల్లా అధ్యక్షులు కోడం రమణ, నాయకులు ఎలిగేటి రాజశేఖర్, అన్నల్దాస్ గణేష్, సూరం పద్మ, జవ్వాజి విమల, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, కుడిక్యాల కనకయ్య, కూచన శంకర్, కంది మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పాపను దత్తత తీసుకున్న పశ్చిమబెంగాల్ దంపతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సిద్దిపేట జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 6 నెలల పాపను పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన దంపతులు శనివారం దత్తత తీసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేతుల మీదుగా అధికారికంగా దత్తత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తద్వారా ఎలాంటి న్యాయ పరమైన ఇబ్బందులూ ఉండవని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.సావిత్రి, బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజు, శిశుగృహ మేనేజర్ ఝాన్సి పాల్గొన్నారు.

బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

- క్రికెట్ బెట్టింగ్‌లో రూ.25 లక్షలు లాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని.. అప్పులు పెరగడంతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో శనివారం జరిగింది. సదాశివపేట సిఐ మహేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చింత వినీత్ (25) అప్పులు తెచ్చి క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టేవాడు. ఈ క్రమంలో మొత్తంగా అతడు రూ.25 లక్షలు అప్పు తెచ్చి బెట్టింగ్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. తెచ్చిన అప్పులు చెల్లించే దారిలేక వినీత్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తాత చింత వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు.

మే 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ మూడో తేదీ వరకు అవి జరుగుతాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శనివారం పరీక్షల సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపునకు తుదిగడువు వచ్చేనెల రెండో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి జరుగుతాయని పేర్కొన్నారు.

కెసిఆర్‌ను డ్యామేజ్ చేశారుగా!

- కారుకు గుడ్ బై తప్పదా?
- 30న కాంగ్రెస్‌లోకి గుత్తా?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనమండలి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి బిఆర్ఎస్‌ను వీడనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆ పార్టీపైన, కెసిఆర్‌పైన ఆయన చేసిన వ్యాఖ్యలు అందుకు బలం చేకూర్చుతున్నాయి. కొడుక్కు టికెట్ రాకపోవడం.. తనయుడి రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ మారనున్నట్టు తెలుస్తోంది. కొన్నాళ్లుగా మాజీ సిఎం కెసిఆర్ పట్ల గుత్తా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే కెసిఆర్ కోటరీ వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయినట్టు సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. తనకు కెసిఆర్ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. బిఆర్ఎస్‌లో అంతర్గత సమస్యలు, నేతల సహాయ నిరాకరణతోనే తన కొడుకు అమిత్ రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నట్టు చెప్పారు. మరోవైపు కొడుకు అమిత్ రెడ్డి వరంగల్ నేత, రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డితో భేటీ అయిన విషయం కేసీఆర్ దృష్టికి వెళ్లినట్టు సమాచారం. అప్పటినుంచి గుత్తాను కెసిఆర్ పూర్తిగా దూరం పెట్టేశారని తెలిసింది. కొడుక్కి కాంగ్రెస్ నుంచి టికెట్ వచ్చుంటే గుత్తా కూడా ఈపాటికే ఆ పార్టీలోకి వెళ్లిపోయేవారని బిఆర్ఎస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా కెసిఆర్‌ను ఉద్దేశించి సుఖేందర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

30న కాంగ్రెస్‌లోకి గుత్తా...?

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితోపాటు మరి కొందరు ముఖ్య నేతలు బీఆర్ఎస్‌కు గుడ్ బాయ్ చెప్పనున్నారు. వారంతా మంచి ముహూర్తం చూసుకొని కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమ య్యారని తెలిసింది. ఈనెల 30న హస్తం గూటికి చేరేందుకు ముహూర్తం ఫిక్స్ అయిందని సమాచారం. ఇప్పటికే ఆయనతో సన్నిహితంగా ఉండే ఎమ్మెల్సీలతో మంతనాలు జరిపి, అందరూ మూకుమ్మడిగా చేరే ప్లాన్ చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం కీలక దశకు చేరుకునే సమయంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకొని ఆ పార్టీకి షాక్ ఇవ్వనున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. గుత్తాతో పాటు ఆయన తనయుడు అమిత్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, కీలక నేతలతో హస్తం గూటికి చేరనున్నారు. తనయుడి రాజకీయ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ బాట పడుతున్నారనే చర్చ జరుగుతోంది. ఈనెల 30న సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారని సమాచారం.

వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలి

- జన జాతర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత, గిరిజన, బలహీనవర్గాలకు రాజ్యాంగబద్ధంగా కల్పించబడిన హక్కులను కాలరాస్తున్న మతోన్మాద బిజెపిని ఈ ఎన్నికల్లో ఓడించాలని వక్తలు అన్నారు. పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక ఉద్యమాలను బలోపేతం చేయాలని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవి రమణ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ పిలుపునిచ్చారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్‌లో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్ జనజాతర జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించడమే సామాజిక శక్తుల కర్తవ్యమన్నారు. మనుస్మృతి వారసురాలు బిజెపిని ఓడించడం ద్వారా రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో దేశాన్ని అట్టడుగుకు చేర్చిన బిజెపి విధానాలు.. దేశ సమైక్యతకు విఘాతం కలిగిస్తాయని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా రిజర్వేషన్లు లేకుండా చేయాలని యోచిస్తుందని, తద్వారా సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

జహంగీర్‌ను గెలిపించుకుందాం..

- ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఎండి జహంగీర్‌ను గెలిపించి, ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లా నాగారం మండల పరిధిలోని ఢీకొత్తపల్లి గ్రామంలోని ఉపాధిహామీ పనులను పరిశీలించి కార్మికులతో ఆమె మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి బిజెపి ప్రభుత్వం వచ్చినట్టయితే ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి రైతులు, కార్మికులను ఇబ్బందిపెడుతూ బడా కార్పొరేట్ సంస్థలతో అంటకాగుతోందని విమర్శించారు. విద్య, వైద్య రంగాలను కార్పొరేట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సుత్తికొడవలి నక్షత్రం గుర్తుకు ఓటేసి జహంగీర్‌ను పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, నాయకులు జె నర్సింహారావు, దేవరకొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న జహంగీర్

ప్రశ్నించే వారికి అవకాశం ఇవ్వండి

- ఆదరించి.. ఓటేసి గెలిపించండి
- సిపిఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న తనకు.. చట్టసభల్లో ప్రజల పక్షాన పోరాడేందుకు అవకాశం ఇవ్వాలని.. ఓటేసి గెలిపించాలని సిపిఎం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి మహమ్మద్ జహంగీర్ అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పిట్టంపల్లి, వెలిమినేడు, నేరడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వెలిమినేడు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేరడ గ్రామంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య అధ్యక్షతన జరిగిన సభలో జహంగీర్ మాట్లాడారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే సిపిఎంను ఈ ఎన్నికల్లో ఆదరించాలన్నారు. సమస్త వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం, ఈ ప్రాంతంలో ఉదయ సముద్రం ప్రాజెక్టు కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించామని చెప్పారు. కల్లుగీత కార్మికుల కోసం ఏనాడూ పోరాటం చేయని బూర నర్సయ్యగౌడ్‌కు గీత కార్మికులను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బిజెపిని ప్రజలు తిరస్కరించాలని కోరారు.

డబ్బులు ఉన్నవాళ్లు పార్ట్‌టైం రాజకీయాలు చేస్తున్నారని, ఎన్నికల్లో పోటీకి వచ్చారని, ఎలాంటి వ్యాపారాలు లేని తాను పూర్తికాలం ప్రజల కోసమే పనిచేస్తున్నానని చెప్పారు. తమ కోసం పనిచేస్తున్న తనకు ఓటేసి గెలిపించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. బిజెపి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపిల పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి చట్టసభలలో ప్రశ్నించే వాడిని లేకుండా చేస్తున్నారని అన్నారు. రాముడి పేరుతో రాజకీయం చేస్తున్న నరేంద్ర మోడీని ఓడించాలన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం సిపిఎం అభ్యర్థి జహంగీర్‌ని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో సిపిఎం సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు అరుణజ్యోతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టి-వర్క్స్‌లో 'డిజైన్ వాన్‌గార్డ్' షో ఏర్పాటు

- వోక్సెన్ యూనివర్సిటీ నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలో తొలిసారి డిజైన్ షో 'డిజైన్ వాన్‌గార్డ్ 2024'ను వోక్సెన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ డిజైన్ నిర్వహించింది. టి-వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 20 వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ కార్యక్రమంలో వాతావరణంలో మార్పులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, క్రాఫ్ట్ ఇన్నోవేషన్, ఇన్‌క్లూజివ్ డిజైన్, మెంటల్ వెల్‌నెస్, హెరిటేజ్ కన్జర్వేషన్ వంటి సామాజిక సంబంధిత వినూత్న ప్రాజెక్టులను ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమానికి దర్శకుడు అడివి శేష హాజరై.. విద్యార్థులను ప్రశంసించారు. అసాధారణమైన ప్రతిభావంతులైన డిజైన్ విద్యార్థులు తమ ఉత్తమ పనిని, వినూత్న భావనలు ప్రదర్శించడానికి వేదికను సృష్టించడం చాలా కీలకమని వోక్సెన్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ డిజైన్ డీన్ ఆదితి సక్సేనా పేర్కొన్నారు.

అరుదైన వ్యాధికి మెడికవర్‌లో చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్

రెట్రోపెరిటోనియల్ ఫైబ్రోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న సుడాన్ పేషెంట్ కు రోబోటిక్ ద్వారా అధునాతన శస్త్రచికిత్స చేసి రోగి ప్రాణాలను కాపాడినట్లు మెడికవర్ హాస్పిటల్స్ యూరాలజీ విభాగం వైద్యులు తెలిపారు. "61 ఏళ్ళ మహిళ మొహమ్మద్ ఫాగిడా మూత్ర సంబంధ అవరోధం రుగ్మతతో బాధపడుతూ వాళ్ళ దేశంలో, భారత్‌లోనూ అనేక హాస్పిటల్స్ కు వెళ్లడం జరిగింది. కానీ ఆమెకు ఎక్కడ కూడా సరైన పరిష్కారం దొరకలేదు, ప్రయోజనం లేకపోయింది ఆమెకు మూత్రనాళాలు అవరోధం కలిగి మూత్రపిండాలు వైఫల్యానికి కారణం అయింది. దీనికి తోడు ఆమెకు ఇదివరకే డీప్ వెయిన్ థ్రాంబోసిస్, మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్నారు. చివరకు మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్ ఎవి రవికుమార్‌ను సంప్రదించడం జరిగింది. ఆమెకు పలు పరీక్షలు చేసి రెట్రోపెరిటోనియల్ ఫైబ్రోసిస్ అనే అరుదైన వ్యాధి ఉందని గుర్తించడం జరిగింది." ఆ మెడికవర్ హాస్పిటల్ ఓ ప్రకటనలో తెలిపింది. "రోబోటిక్ యూరిటెరోలిసిస్ అండ్ ఓమెంటల్ ర్యాపింగ్ సర్జరీ చేయడం జరిగింది. ఈ వ్యాధి వల్ల ఆపరేషన్ చేసే సమయంలో రక్త నాళాలతో వచ్చిన సవాళ్లను అధునాతన రోబోటిక్స్ శస్త్రచికిత్సను సమర్థవంతంగా నిర్వహించి రోగిని కాపాడటం జరిగింది." అని డాక్టర్ రవి కుమార్ పేర్కొన్నారు.

రసవత్తరంగా ఆదిలాబాద్ లోక్‌సభ సమరం

- పాగా వేయాలని కాంగ్రెస్..
- పోగొట్టుకున్న చోటే రాబట్టుకోవాలని బిఆర్ఎస్
- సిట్టింగ్ స్థానం నిలుపుకొనేందుకు బిజెపి యత్నం
- విజయమే లక్ష్యంగా దూసుకెళ్తున్న ప్రధాన పార్టీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ లోక్‌సభ సమరం రసవత్తరంగా మారుతోంది. ఇప్పటికే ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడం.. ప్రధాన పార్టీల అభ్యర్థుల నామపత్రాలకు ఆమోదం లభించడంతో ప్రచార పర్వంపై మరింత దూకుడు పెంచుతున్నాయి. పల్లె, పట్టణాల్లో ప్రచారం హోరెత్తుతోంది. 16 ఏళ్లుగా విజయం దక్కని ఈ స్థానంలో పాగా వేయాలని కాంగ్రెస్ భావిస్తుండగా.. గెలిచి పట్టు నిలుపుకోవాలని బిఆర్ఎస్ యత్నిస్తోంది. ఇక సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బిజెపి ఆరాటపడుతుతోంది.

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని దక్కించుకునేందుకు ప్రధాన పార్టీలు హోరాహోరీ తలపడుతున్నాయి. నెల రోజుల ముందు నుంచే ప్రచారం ప్రారంభమైనా.. నామినేషన్ల క్రతువు పూర్తికావడంతో మరింత ముమ్మరమవుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ తరపున ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ నిర్వహించగా.. అంతకుముందు బిఆర్ఎస్ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హాజరై శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. తాజాగా బిజెపి తరపున మే 1న కాగజ్‌నగర్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అగ్రనేతల పర్యటనలతో వేడెక్కిన ఎన్నికల సమరం.. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో మరింత పదునెక్కుతోంది. ఒకరిపై ఒకరు విమర్శల జడివాన కురిపించుకోగా.. అభ్యర్థుల గుణగణాలపైనా ఆరోపణాస్త్రాలు సంధించుకోవడం ఆసక్తికరంగా మారుతోంది.

విజయమే లక్ష్యంగా పావులు..!

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు సమాయత్తమవుతున్నాయి. గత చరిత్రను పక్కన పెడితే.. తెలంగాణ ఉద్యమకాలంలో 2008లో లోక్‌సభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో గెలవని కాంగ్రెస్ ఈ సారి ఎలాగైనా విజయం దక్కించుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. ఉపాధ్యాయురాలు, ఆదివాసీ హక్కుల ఉద్యమకారిణి ఆత్రం సుగుణను ఆ పార్టీ నుంచి బరిలో దింపింది. తొలిసారి మహిళకు ఆ పార్టీ టికెట్ కేటాయించడమే కాకుండా గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు గెలుపు కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఇతర పార్టీల కీలక నాయకులను పార్టీలో చేర్చుకోవడం ద్వారా బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతూ ప్రజల్లో సానుకూల స్పందన వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటంతో లోక్‌సభ స్థానాన్ని సైతం చేజిక్కించుకునేందుకు ఉమ్మడి జిల్లాలో మరింత పట్టు సాధించాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. 2014లో ఈ స్థానంలో గెలిచిన బిఆర్ఎస్ ఆ తర్వాత 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చవిచూసింది. ఆ సమయంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం కోల్పోవడం ఆ పార్టీకి నిరాశను మిగిల్చింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ పార్టీ ఘోర ఓటమి పొందినా.. లోక్‌సభ పరిధిలో ఓట్లు మాత్రం ఇతర పార్టీల కంటే అధికంగానే సాధించింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును బరిలో దింపింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉమ్మడి జిల్లాలో తిరుగులేని శక్తిగా ఉన్న గులాబీ పార్టీ.. ఆ తర్వాత డీలా పడింది. కోల్పోయిన చోటనే తిరిగి రాబట్టుకోవాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పట్టునిలుపుకోవాలని భావిస్తోంది. ఇక 2019 ఎన్నికల్లో గెలిచిన బిజెపి మరోసారి విజయం సాధించాలని విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. సిట్టింగ్ ఎంపిగా ఉన్న సోయం బాపురావును కాదని బిఆర్ఎస్ నుంచి బిజెపిలో చేరిన మాజీ ఎంపి గోడం నగేష్‌కు టికెట్ కేటాయించింది. ఈ లోక్‌సభ పరిధిలో ఈ పార్టీకి తొలిసారి నలుగురు ఎమ్మెల్యేలు ఉండటం విజయానికి కలిసి వస్తుందని నేతలు విశ్వసిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు పల్లె, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అభ్యర్థి తరపున ప్రచారానికి అగ్రనేతలు కూడా జిల్లాకు రానున్నట్లు తెలుస్తోంది. గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ అధిష్టానం ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్టు సమాచారం. ప్రధాన పార్టీలతో పాటు బిఎస్‌పి, డిఎస్‌పి కూడా గణనీయ సంఖ్యలో ఓట్లను సాధించాలని భావిస్తున్నాయి.

గల్ఫ్ నకిలీ ఏజెన్సీ సభ్యుడి అరెస్ట్

- దేశవ్యాప్తంగా 500 నుంచి 600 మంది బాధితులు
- నకిలీ ఏజెంట్ సంస్థల మాటలతో మోసపోవద్దు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్నవి రెండే లైసెన్సుడ్ ఏజెంట్ సంస్థలు
- ఎస్‌పి అఖిల్ మహాజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి ఆశలతో గల్ఫ్‌కు వెళ్లాలనుకునే వారిని మోసగించి తీసుకెళ్లి సైబర్ నేరాలు చేయిస్తున్న నకిలీ ఏజెంట్ ముఠా సభ్యున్ని సిరిసిల్ల పోలీసులు అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా 500 నుంచి 600 మంది బాధితులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అనధికార గల్ఫ్ ఏజెంట్ సంస్థలతో యువత భవిష్యత్ అంధకారం అవుతుందని జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్ అన్నారు.

శనివారం జిల్లా పోలిస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఎస్‌పి అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ కార్యాలయానికి నాలుగు రోజుల కిందట సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెందిన అతికం లక్ష్మీ వచ్చి.. తన కొడుకు అతికం శివప్రసాద్.. జగిత్యాల జిల్లా కోడిమ్యాల గ్రామానికి చెందిన కంచర్ల సాయి ప్రసాద్ అనే ఏజెంట్‌కి రూ.1.40 లక్షలు ఇచ్చినట్టు తెలిపిందన్నారు. అతను తన కుమారున్ని ఉపాధి కోసం కంబోడియా దేశానికి పంపించాడని, అక్కడ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

ఈ విషయమై శివ ప్రసాద్ మొబైల్ నెంబర్ తీసుకొని వాట్సప్ ద్వారా విచారించగా, కాంబోడియాలో చైనీస్ కంపెనీలో శివ ప్రసాద్ పాస్‌పోర్ట్ తీసుకొని సైబర్ నేరాలు చేయిస్తున్నారని, తనలాగే భారత్‌కు చెందిన సుమారు 500 నుంచి 600 మంది బాధితులు ఉన్నట్టు తెలిపినట్టు వివరించారు. వారందరితో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి ఇండియన్ ఫోన్ నంబర్స్ ఇచ్చి లాటరీ ఫ్రాడ్స్, జాబ్ ఫ్రాడ్స్, టాస్కులు ఇచ్చి.. అవి చేస్తే అధికమొత్తంలో డబ్బులు వస్తాయని సైబర్ మోసాలు చేయిస్తున్నారని తెలిపారు. బాధితురాలు అతికం లక్ష్మి పిర్యాదుపై, సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, కంబోడియాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడి బాధితుని వివరాలు పంపించామన్నారు. అక్కడి లోకల్ పోలీస్‌ల సహాయంతో రెస్క్యూ చేసి శివ ప్రసాద్‌ను రక్షించిందని ఎస్‌పి తెలిపారు. శివ ప్రసాద్ రెండ్రోజుల్లో ఇండియాకు చేరుకుంటాడని, అతడిలాగే అక్కడ ఉన్న బాధితులని కాపాడి ఇండియాకు తీసుకొస్తామని తెలిపారు. దాంతోపాటు లక్ష్మి ఫిర్యాదుతో జగిత్యాల జిల్లాకు చెందిన కంచర్ల సాయి ప్రసాద్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొని విచారించినట్టు చెప్పారు.

తాను రూ.10వేలు కమీషన్ తీసుకొని లక్నోకు చెందిన సదాకత్ అనే వ్యక్తికి పంపినట్టు అతను విచారణలో తెలిపాడన్నారు. ప్రస్తుతం సదాకత్ మాల్దీవ్స్‌లో ఉంటున్నాడని, అతను కూడా రూ. పది వేలు కమీషన్ తీసుకొని పూణేలో ఉన్న అబిద్ అన్సారీకి పంపుతాడని చెప్పారు. వీరు బీహార్ రాష్టానికి చెందిన ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న షాదబ్‌కి పంపగా, శివను కంబోడియా దేశానికి పంపించినట్టు తెలిపారు. జగిత్యాల జిల్లాకు చెందిన కంచర్ల సాయి ప్రసాద్‌ను, పూణేలో ఉన్న అబిద్ అన్సారీని అదుపులోకి తీసుకున్నామని, మిగతా ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని ఎస్‌పి తెలిపారు.

అనుమానాలుంటే పోలిస్‌లను సంప్రదించండి

ఉద్యోగ, ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్ళుతున్న యువకులు లైసెన్స్ కలిగి ఉన్న ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలని ఎస్‌పి సూచించారు. జిల్లాలో ఎవరైతే ఏజెన్సీలు, ఏజెంట్ల చేతిలో మోసపోయారో వారి కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అధికారి ఫోన్ నెంబర్ 8712656411కు నేరుగా ఫోన్ కాల్ ద్వారా ఫిర్యాదు చేయాలని చెప్పారు. విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిఎస్‌పి చంద్రశేఖర్ రెడ్డి, సిఐ రఘుపతి, టాస్క్‌ఫోర్స్ సిఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.